# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ మాసపత్రిక

MAY - 2008

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్
## Asian Bible Lectureship at Kakinada

తేదీలు : 2008 నవంబరు 30వ తేదీ నుండి

డిశంబరు 4వ తేదీ వరకు

సమయం : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు

మధ్యాహ్నం 3:00 గంటలకు

సాయంత్రం 6:00 గంటలకు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

విద్యుత్ నగర్

**కాకినాడ**

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు. బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

**Cell :** 92474 56270
0884`2363722

వందనములతో

రిక్కీ గూటం గారు

జాషూవా గూటం గారు

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.O.Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | మే 2008 | సంచిక 10


## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 2

## (Jesus Christ, the son of God - 2)

యేసు ప్రభువు మున్నెన్నడు ఎవడు జన్మించని రీతిగా ఒక కన్యక గర్భమున పుట్టెను. తన జనన విధానమును బట్టి దేవుని కుమారుడని, నిరూపించు కొనెనని గత పాఠములో మనం నేర్చుకొన్నాము. ఆయన అట్లు జన్మిస్తారని 700 సం॥లకు ముందే దేవుడు తన ప్రవక్తద్వారా ప్రజలకు తెలియజేసెను. "కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును'' అని యెషయా ప్రవచించెను (యెషయా 7:14). ఇమ్మానుయేలను పదమునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని యర్థము. యెషయా ప్రవచించిన రీతిగనే కన్యయైన మరియు గర్భవతియై కుమారుని కనెను. ఆ కుమారుడు మనతో యున్నప్పుడు దేవుడే మనతో యుండెను. ఆయనే యేసుక్రీస్తు.

బాలుడైన "యేసు జ్ఞానమందును.

వయసున్ననందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను" (లూకా 2:52). ఆ దినముల యందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి – పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని యూదయ అరణ్యములో ప్రకటించు చుండెను. ఆ సమయమున యెరూషలేము వారును యూదయ వారందరును యొర్దాను నదీ ప్రాంతముల వారందరును అతని యొద్దకు వచ్చి తమ పాపములు ఒప్పుకొనుచు, యొర్దానులో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి" (మత్తయి 3:17).

"ఆ సమయమున యోహానుచేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయ నుండి యొర్దాను దగ్గరనున్న అతని యొద్దకు వచ్చెను. అందుకు యోహాను – నేను నీచేత బాప్తిస్మము పొందవలసిన వాడనైయుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా? అని ఆయనను నివారింపజూచెను గాని – యేసు ఇప్పటికి కానిమ్ము; నీతియావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను. యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరువబడెను. దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుటచూచెను. మరియు ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందిచుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (మత్తయి 3:13–17). "యేసు బోధింప నారంభించినప్పుడు ఆయన దాదాపు ముప్పది ఏండ్లవాడు" (లూకా 3:23).

## తండ్రియైన దేవుని సాక్ష్యము

యేసుప్రభువు తనలో పాపమేమియు లేకపోయినను యొర్దానులో యోహానుచే బాప్తిస్మము పొందెను. నీతియావత్తు నెరవేర్చుటకు ఆయన బాప్తిస్మము పొందెను. అయితే కుమారుడైన క్రీస్తు దేవుని ఆజ్ఞకు ఇట్లు లోబడగా పరిశుద్ధాత్మ దేవుడు పావురమువలె ఆయన మీదికిదిగెను, తండ్రియైన దేవుడు ఆకాశము నుండి తన స్వరమునెత్తి "ఈయనే నా ప్రియ కుమారుడు; ఈయన యందు నేనానందించుచున్నాను" అని పలికి లోకమున కంతటికి క్రీస్తును

పరచయము చేసెను. ఈయనే నా ప్రియ కుమారుడని తండ్రియైన దేవుడు సాక్ష్యమిచ్చెను. గనుక తండ్రి యిచ్చిన సాక్ష్యమునుబట్టి యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనము తప్పక విశ్వసించాలి.

మరికొన్ని దినములైన తరువాత యేసు తన శిష్యులగు "పేతురును, యాకోబును అతని సహోదరుడైన యోహానును వెంటబెట్టుకొని యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారియెదుట రూపాంతరము పొందెను. ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను; ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను. ఇదిగో మోషేయు, ఏలీయాయు వారికి కనబడి ఆయనతో మాటలాడుచుండిరి. అప్పుడు పేతురు ప్రభువా, మనమిక్కడ ఉండుట మంచిది; నీకిష్టమైతే ఇక్కడ నీకొకటియు, మోషేకు ఒకటియు, ఏలీయాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదుమని యేసుతో చెప్పెను. అతడు ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములో నుండి పుట్టెను" (మత్తయి 17:1-5).

యేసుప్రభువు రూపాంతరము పొందిన ఈ సందర్భములో మరి యొక మారు తండ్రియైన దేవుడు ఆకాశమునుండి తన స్వరమును వినిపించి యేసు ఆయన యొక్క ప్రియకుమారుడని సాక్ష్యమిచ్చెను. అంతేకాదు ఇక మీదట ప్రజలు మోషేను, ప్రవక్తలనుగాక (అంటే పాతనిబంధనను గాక) తన కుమారుడైన క్రీస్తును, ఆయన మాటలను (అనగా క్రొత్తనిబంధనను) వినవలెనని హెచ్చరించెను. నిశ్చయముగా తండ్రియైన దేవుడు కుమారుడైన దేవుని గూర్చి యిచ్చిన సాక్ష్యమును మనము నమ్మవచ్చునుగదా. అందుకే "నేను ఆయనని మీరు విశ్వసింపని యెడల మీ పాపములలోనే చనిపోవుదురని" యేసు బోధించెను.

యేసు ప్రభువు చనిపోయిన లాజరును బేతనియలో బ్రదికించెను. ఆటు తరువాత పస్కాపండుగ సందర్భములో యెరూషలేములో ప్రవేశించెను. బహు జన సమూహములు

ఖర్జూరపు మట్టలు పట్టుకొని ఆయనను ఎదుర్కొనబోయి - జయము ప్రభువు పేరట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడునుగాక అని కేకలు వేయుచు ఆయనకు స్వాగతము పలికిరి. ఆ పండుగలో ఆరాధింప వచ్చిన వారిలో కొందరు గ్రీసు దేశస్థులుండిరి. వారు యేసును చూడగోరి ఆయన యొద్దకు తేబడగా, యేసు "ఒకడు నన్ను సేవించిన యెడల నన్ను వెంబడింపవలెను; అప్పుడు నేను ఎక్కడ ఉందునో అక్కడ నా సేవకుడును ఉండును; ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘనపరచును.....తండ్రీ నీ నామము ఘనపరచుము అని చెప్పెను. అంతట నేను దానిని మహిమ పరచితిని, మరల మహిమపరతును అను యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను. కాబట్టి అక్కడ నిలుచుండి వినిన జనసమూహము - ఉరిమెను అనిరి. మరికొందరు దేవదూత ఒకడు ఆయనతో మాటలాడెననిరి. అందుకు యేసు ఈ శబ్దము నా కొరకు రాలేదు, మీ కొరకే వచ్చెను...... నేను భూమిమీద నుండి పైకెత్త బడిన యెడల అందరిని నా యొద్దకు ఆకర్షించు కొందునని చెప్పెను" (యోహాను 12:20-32).

ఇక్కడ మూడవసారి తండ్రియైన దేవుడు ఆకాశము నుండి తన కుమారుని గూర్చి సాక్ష్యమిచ్చుట మనము గమనించుచున్నాము. నిశ్చయముగా తండ్రి యిచ్చిన సాక్ష్యమును బట్టి యేసు ఎవరో మనము అంగీకరించవలసి యున్నదిగదా. ఆయన దేవుని కుమారుడు. అందుకే "అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" అని యేసుప్రభువు పలికాడు (యోహాను 17:3).

### తనను గూర్చి తానిచ్చిన సాక్ష్యము

యేసుప్రభువు తాను దేవుని కుమారుడనని బోధించుకొనినందు వలన కొందరు యూదులు ఆయనతో తర్కములాడుచుండిరి. ఆయనను చంపజూచుచుండిరి. యోహాను సువార్త 8వ అధ్యాయమంతయును యూదులకు యేసుకు మధ్య జరిగిన వాగ్వివాదముతో నిండియున్నది. యేసు వారితో, "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగుకలిగి యుండునని వారితో చెప్పెను. కాబట్టి పరిసయ్యులు - నిన్ను

గూర్చి నీవే సాక్ష్యము చెప్పుకొనుచున్నావు; నీ సాక్ష్యము సత్యము కాదని ఆయనతో అనగా యేసు – నేన ఎక్కడనుండి వచ్చితినో యెక్కడికి వెళ్లుదునో నేనెరుగుదును గనుక నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనినను నా సాక్ష్యము సత్యమే. నేను ఒక్కడనై యుండక నేనును నన్ను పంపిన తండ్రియు కూడనున్నాము గనుక నేను తీర్పు తీర్చినను, నా తీర్పు సత్యమే. నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాడని చెప్పెను... అప్పుడాయన మీరు క్రిందివారు, నేను పై నుండువాడను; మీరు ఈ లోకసంబంధులు, నేను ఈ లోకసంబంధుడను కాను. కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురన వారితో చెప్పెను. కాబట్టి వారు – నీవెవరవని ఆయననడుగగా యేసు వారితో – మొదట నుండి నేను మీతో ఎవడనని చెప్పుచుంటినో వాడినే... నేను (తండ్రియైన దేవుని) యొద్ద వినిన సంగతులే లోకమునకు బోధించుచున్నానని చెప్పెను" (యోహాను సువార్త 8వ అధ్యాయము దయచేసి చదవండి).

"ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు దావీదు కుమారుడని చెప్పిరి, అందుకాయన – ఆలాగైతే నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు నీవు నా కుడి పార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని ఆత్మ వలన ఏల చెప్పుచున్నాడు? దావీదు ఆయనను ప్రభువని చెప్పినయెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారి నడుగగా ఎవడును మారుమాట చెప్పలేకపోయెను" (మత్తయి 22:41-45).

## యితరుల సాక్ష్యము

యేసు యొక్క శిష్యులు ఆయన నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:33). "సీమోను, పేతురు – ప్రభువా యెవని యొద్దకు వెళ్లుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు; నీవే దేవుని

పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:69). మనుష్యులను పట్టి పీడించుచున్న దయ్యములు సయితము ఆయనను దేవుని కుమారుడని ఒప్పుకొనిరి. "వారు - ఇదిగో దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాకమునుపే మమ్మును బాధించుటకు వచ్చితివా"? అనికేకలు వేసిరి (మత్తయి 8:29). చివరకు సాతానుడు సయితము ఆయనను శోధించుచు, నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను (మత్తయి 4:3).

యేసు సిలువ మీద వ్రేలాడుచు తన ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెరపైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను, భూమి వణకెను, బండలు బద్దలాయెను, సమాధులు తెరవబడెను. శతాధిపతియు అతనితో సిలువ యొద్ద కావలియున్న వారును భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి మిక్కిలి భయపడి - నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి (మత్తయి 27:54).

తండ్రియైన దేవుడిచ్చిన సాక్ష్యమునుబట్టి, క్రీస్తు తననుగూర్చి తానిచ్చిన సాక్ష్యమునుబట్టి, క్రీస్తు యొక్క మిత్రులు, శత్రువులు, చివరకు ఆయనను సిలువ వేసినవారి ప్రత్యక్ష సాక్ష్యమును బట్టి ఆయన దేవుని కుమారుడని మనము నమ్మకతప్పదు. ఆయనను నమ్మకపోతే నరకము తప్పదు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లని వానికి శిక్షవిధించబడునని" యేసు ప్రభువే చెప్పారు. నీవు దేనినెంచుకొంటావు? రక్షణనా? లేక శిక్షనా?

**సత్యవాణి** T.V కార్యక్రమములను ప్రతిసోమవారం నుండి శుక్రవారం వరకు శుభవార్త ఛానల్‌లో ఉదయం 6:00 గంటలకు, రాత్రి 10:30 గంటలకు చూడండి. T.V - 5 లో ప్రతిశనివారం ఉదయం 6:30 గంటలకు చూడండి. సత్యసువార్తను వినండి! విన్పించండి !!

# సంఘమందలి దీవెనలు
# (Blessings in the Church)

క్రీసు సంఘుమును అనేకులు మతశాఖల దృక్పధముతో చూచెదరు. అందువలన వారు తమ గౌరవమును పోగొట్టుకొనిరి. వారు క్రైస్తవులవలె యుండవలెనని యనుకొందురుగాని క్రీస్తు సంఘముతో మాత్రము పొత్తు కలిగి యుండరు. బైబిలు వర్ణించు రీతిగ వారు సంఘమును గమనించగలిగితే, వారి మనస్తత్వము చాల వేరుగ యుండును. అప్పుడు వారు కూడ అందులో భాగస్థులై యుండవలెనని కోరుదురు. క్రీస్తు సంఘములో లేకుండ క్రైస్తవులై యుండుట అసాధ్యమని వారు తప్పక గ్రహించుకొనగలరు. ఈ సంగతి సత్యము. మరియు వారు దీవెనలతో నిండియున్న గృహములో సభ్యులుగ యున్నామని ఇట్టే గ్రహించగలరు.

ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును క్రీస్తునందును (ఎఫెసీ 1:3), ఆయన శరీరమయిన సంఘుమందును ఉన్నవని పౌలు చెప్పుచున్నాడు (కొలస్స 1:18; ఎఫెసీ 1:22,23). అందువలన అట్టి ఆశీర్వాదములన్నియును సంఘమందున్నవి. అవన్నియును సంఘమందున్న యెడల, సంఘమునకు వెలుపల ఆత్మీయ ఆశీర్వాదములు ఏమియును లేవని దీని యర్థము. ఇది సత్యము గనుక తరువాత మన ప్రశ్న సహజముగ ఏమంటే ఒకడు క్రీస్తులోనికి, ఆయన సంఘములోనికి ఎట్లు ప్రవేశించును?

క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి ప్రవేశించు మార్గము ఒకేఒక్కటి యున్నదని బైబిలు బోధించుచున్నది. అది ఆయన సువార్తకు లోబడుట ద్వారా మాత్రమే. ఒకడు రక్షించబడవలె నంటే అతడు సువార్తను వినవలెను (రోమా 10:17). దానిని విశ్వసించవలెను (హెబ్రీ 11:6). తన పావముల విషయమై మారుమనస్సు పొందవలెను (అపొ.కా. 17:30). క్రీస్తును ఒప్పుకొనవలెను (మత్తయి 10:32). బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:38) అని లేఖనములు బోధించుచున్నవి. అందువలననే "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన

మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా''? అని వ్రాయబడి యుండుట మనము చూడగలము (రోమా 6:3). మరల, ''యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని వ్రాయబడి యుండుట చూడగలము (గలతీ 3:26,27). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందుట యనగా ఆయన శరీరములోనికి లేక సంఘములోనికి బాప్తిస్మము పొందుటయే యని గమనించుటకు ఈ దిగువ వచనమును గమనించుము: "ఏలాగనగా, యూదుల మైనను, గ్రీసు దేశస్తులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి, ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి" (1కొరింధి 12:13)). క్రీస్తులోనికి, ఆయన శరీరములోనికి ఒకడు చేరే మార్గము ఇది ఒక్కటే.

సంఘమందు ప్రవేశించుట యెట్లో మన మెరిగిన తరువాత, అందున్న ఆత్మీయ ఆశీర్వాదములను గూర్చి చూచు కొందము, వాటిలో కొన్ని ఏమిటి? వాటిని ఈ దిగువ నుదహరించుదము:

**1. క్షమాపణ :** "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను. ఆ కుమారుని యందు మనకు నిత్యవిమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1:13,14). ఇక్కడ చెప్పబడిన రాజ్యము సంఘమే (మత్తయి 16:18, 19), అది క్రీస్తు రక్తముచే కొనబడెను (అపొ.కా. 20:28). ఆయన రక్తము ద్వారా మనకు పాపక్షమాపణ కలుగును.

**2. రక్షణ :** "అందుచేత ఏర్పరచబడిన వారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసునందలి రక్షణపొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను" (2తిమోతి 2:10). క్రీస్తు యేసునకు లోబడుట ద్వారా మనము పాపముల నుండి రక్షించబడుదుము (మార్కు 16:16). గనుక ఆయన సంఘములో చేర్చబడుదుము (అపొ.కా. 2:47).

**3. విమోచన :** ''దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన

అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది'' (ఎఫెసీ 1:7). దుష్టునినుండి మనము విమోచింవబడితివి. విడుదల చేయబడితిమి.

**4. శిక్షావిధి యుండదు :** "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏశిక్షావిధియు లేదు''. అట్టివారు శరీరము ననుసరింపక ఆత్మ ననుసరించియే నడుచుకొందురు (రోమా 8:1-3). శిక్షావిధి యుండదు అను వాగ్దానము క్రీస్తునందున్న వారికి, సంఘమందున్న వారికి చేయబడెను. వారు శరీరానుసారముగా కాక ఆత్మానుసారముగా నడచుకొనవలెనను షరతుపై అది చేయబడెను.

**5. నూతనసృష్టి యగుట :** "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి: పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2కొరింధి 5:17). అనగా మనము క్రీస్తనందును, ఆయన సంఘమునందును నూతన జనులమై యుందుము. మన జీవితములు నూతనముగ ఆరంభించు తరుణము ఇది, అదియే ఒక గొప్ప దీవెనయై యున్నది. తమ జీవితమును మరల ఆరంభించు తరుణము ఇది, అదియే ఒక గొవ్వ దీవెనయై యున్నది. తమ జీవితమున మరల ఆరంభింపవలెనని ఈ లోకములో ఎంత మంది కోరుట లేదు?

**6. సమాధానము :** "తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దానిద్వారా వీరిద్దరిని ఏక శరీరముగాచేసి, దేవునితో సమాధాన పరచవలెనని యీలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు" (ఎఫెసీ 2:16).

**7. కృప :** " నా కుమారుడా, క్రీస్తు యేసునందున్న కృప చేత బలవంతుడవు కమ్ము" (2తిమోతి 2:1).

**8. ప్రేమ :** "మరియు మన ప్రభువు యొక్క కృపయు, క్రీస్తు యేసునందున్న విశ్వాసమును, ప్రేమయు అత్యధికముగా విస్తరించెను" (1 తిమోతి 1:14).

**9. దేవుని బిడ్డలగుట :** "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26,27).

**10. ప్రార్థన :** "ఆయనను బట్టి మనకు

కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించునను నదియే" (యోహాను 5:15). యోహాను 9:31ని కూడ చదువుము.

**11. సహవాసము :** "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల, మనము అన్యోన్య సహవాసముగలవారమై యుందుము, అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).

**12. నిరీక్షణ :** "విశ్వాసముతో కూడిన మీ పనిని, ప్రేమతో కూడిన మీ ప్రయాసమును, మన ప్రభువైన యేసుక్రీస్తు నందలి నిరీక్షణతో కూడిన మీ ఓర్పును మేము మన తండ్రియైన దేవుని యెదుట మానక జ్ఞాపకము చేసికొను చున్నాము" (1 థెస్స 1:3).

**13. ప్రభువు సన్నిధి కలిగియుండుట:** "యుగ సమాప్తి వరకు ఆయన మనతో యుందునని వాగ్దానము చేసెను'' (మత్తయి 28:29).

**14. పరిశుద్ధాత్మ అను వరము :** "మీరు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు'' (అపో.కా. 2:38).

**15. ఆత్మీయ ఆశీర్వాదములన్నియు:** "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక, ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశ్వీరాదమును మన కనుగ్రహించెను" (ఎఫెసీ 1:3).

ఇట్టి ఆశీర్వాదము లనేకము లున్నవి. అవన్నియును సంఘమందున్న వారికే కలుగును గాని దాని వెలుపలనున్న వారికి కలుగవు. అందువలననే ఒకడు క్రీస్తు సంఘముతో పొత్తు కలిగియున్న యెడల అతడు దానిలో ఒక భాగమై యుండగోరునని ఈ పాఠము మొదటిలో మనము చెప్పు కొంటిమి, నీవు సంఘమునకు వెలుపల జీవించవలెనని కోరు చున్నావా? చేయబడిన వాగ్దానముల నొకమారు వెనుకకు తిరిగి గమనించుము క్రీస్తునకు వెలుపల జీవించుచు వాటన్నిటిని పోగొట్టుకొనుటకు నీవు ఇష్టపడుచున్నావా?

**- జె.సి. ఛోట్**

# హార్ మెగిద్దోను యుద్ధము
## (The Battle of Armageddon)

**పరిచయం:**
యోహాను ఘటసర్పము నోటనుండియు (సాతాను) క్రూరమృగము (రోమా ప్రభుత్వము) నోట నుండియు అబద్ధ ప్రవక్త నోటనుండియు కప్పలవంటి మూడు అపవిత్రాత్మలు బయలు వెళ్లగాచూచెను. అవి సూచనలు చేయు నట్టి దయ్యముల ఆత్మలే. "అవి సర్వాధికారియైన దేవుని మహాదినమున జరుగు యుద్ధమునకు లోకమందట ఉన్న రాజులను పోగుచేయవలెనని వారి యొద్దకు బయలు వెళ్లి హెబ్రీ భాషలో హార్ మెగిద్దోనను చోటుకు వారిని పోగుచేసెను" (ప్రకటన 16:13-15).

హార్ మెగిద్దోనను మాట కనబడగానే ప్రజల యొక్క ఆసక్తి రెకెత్తించబడును. అక్కడ ఏదో మహాయుద్ధము జరుగునని వారు తలస్తారు. మున్నెన్నడు జరుగనట్టి భీకరయుద్ధము అక్కడ జరగునని వారనుకొంటారు. అది మన కాలములోనే జరుగునని 'ప్రవక్తలనబడిన' వారు బోధిస్తు యుంటారు. మరికొందరేమో క్రీస్తు రావడానికి ముందు ఆ యుద్ధము సంభవిస్తాదంటారు.

గాని నిజానికి ఆయాసైన్యముల మధ్య జరిగే యుద్ధాన్ని గూర్చి పై లేఖన భాగము బోధించుట లేదు. ప్రకటన గ్రంథము భూసంబంధమైన యుద్ధాలను గూర్చి యేమీ చెప్పుట లేదు. దాని యందు ఆసక్తి కనుబరచదు.

ప్రకటన గ్రంథం అంతా ఆత్మీయ యుద్ధాన్ని గూర్చి ఉపదేశించుచున్నది.

**కొన్ని అబద్ధ సిద్ధాంతాలు :**

a) ఈ హార్ మెగిద్దోను యుద్ధాన్ని గూర్చి డార్బీ అనేవాడు మొదలు పెట్టాడు. స్కోఫీల్డ్ రిఫరెన్స్ బైబిలు దానిని వ్యాపకంచేసింది.

b) వీరు బైబిలు కాలమునంతటినీ ఏడు యుగాలుగా విభజించి ఆ ఖరిది వెయ్యేళ్ల పాలన యుగం అని బోధించడం మొదలుపెట్టారు.

c) క్రీస్తువారు మొదట తన రాజ్యమును స్థాపించుటకు వచ్చి, యూదుల వలన

తిరస్కరింపబడి విఫలమయ్యారని వారు చెబుతారు. పెండ్లి కుమారుడ మరల ప్రయత్నం చేయుచున్నాడు. మత్తయి 24లో చెప్పబడిన 'సూచనలు' ఇప్పుడు జరుగుచున్నాయి గనుక క్రీస్తు త్వరలో వస్తాడని వారు బోధిస్తారు.

d) క్రీస్తు మరల వచ్చినప్పుడు అదృశ్యరీతిగా వస్తారు. అప్పుడు నజీవులైయున్న నీతిమంతులు పైకెత్తబడతారు (Rapture), పరిశుద్ధులు లేపబడతారు. అప్పుడు మొదటి మూడ సంవత్సరాల్లో సొలొమోను దేవాలయం తిరిగి కట్టబడతాది, జంతు బలులు పునః ప్రారంభవుతాయి. ఏడు సంవత్సరములు పైకెత్తబడిన (Rapture) కాలములోని ఆ ఖరిభాగంలో ఈ హర్ మెగిద్దోను యుద్ధము జరుగునని వారు చెబుతారు.

e) క్రీస్తువారు హార్ మెగిద్దోను యుద్ధం తరువాత మరలవచ్చి యెరూషలేములో దావీదు సింహాసనము పైనుండి పాలిస్తారు. తరువాత దుష్టులు లేపబడతారు, తీర్పుసంభవిస్తాది! ఈ సిద్ధాంతం పచ్చి అబద్ధం. లేఖన విరుద్ధం.

గమనించు :

ఈ అబద్ధ సిద్ధాంతానికి జవాబు :

a) యూదులచే క్రీస్తు తిరస్కరింపబడుట వలన క్రీస్తు ఆశ్చర్యపో లేదు. "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తల రాయి ఆయెను" (కీర్తన 118:22).

b) క్రీస్తు తన రాజ్యమును స్థాపించేసారు. ఆ విషయంలో ఆయన యేమీ విఫలమవ్వలేదు. దేవుడు ఫెయిల్ అయ్యారనడం ఎంత హాస్యాస్పదం ! క్రైస్తవులు అంధకార సంబంధమైన రాజ్యములో నుండి ఆయన కుమారుడైన క్రీస్తు వెలుగు రాజ్యములోనికి మార్చబడ్డారని పౌలు చెప్పాడు (కొలస్స 1:13).

యోహాను అప్పటికే దేవుని రాజ్యములో పాలివాడు (ప్రక 1:9).

నీటి మూలముగాను ఆత్మమూలముగాను జన్మించిన వారు ఆ రాజ్యములో ప్రవేశిస్తారు (యోహాను 3:5-7).

రాజ్యమంటూ లేకపోతే దానిలో ఒకడు ఎట్లు ప్రవేశిస్తాడు ?

c) సంఘము రాజ్యము కంటే తక్కువైనది కాదు. రాజ్యము సంఘము ఒక్కటే. సంఘము దేవుని నిత్యసంకల్పమే. జగత్తు పునాది వేయబడకమునుపే అది సంకల్పించబడెను (ఎఫెసీ 3:10-11).

క్రీస్తు రెండవ రాకడ :

క్రీస్తు రెండవ సారి వచ్చునప్పుడు అదృశ్యముగా, నిశ్శబ్దముగా రాదు,

బైబిలు అట్లుచెప్పుట లేదు.

☛ఆయన బూర ధ్వనితో ఆర్భాటముతో అగ్ని జ్వాలలలో వచ్చును (2థెస్స 1:78). ప్రతినేత్రము ఆయనను చూచును (ప్రక 1:7).

☛ఆయన ఆర్భాటముతో ప్రధాన దూత శబ్ధముతో వస్తారు (1థెస్స 4:16).

☛క్రీస్తు వచ్చినప్పుడు ఆకాశములు మహావేంద్రముతో లయమైపోతాయి.

a) నీతిమంతులు, అనీతిమంతులు వేర్వేరు సంవత్సరాల్లోగాక ఒకేసారి లేపబడుదురు. వారందరికి ఒకేసారి తీర్పు తీర్చబడును (యెహాను 5:28,29).

☛బైబిలులో ఏడు సంవత్సరాల మహాశ్రమల కాలమును గూర్చి కూడా చెప్పబడలేదు.

మెగిద్దోను గూర్చి :

పాత నిబంధన కాలములో మెగిద్దో మెట్టప్రాంతములలో ప్రఖ్యాత యుద్ధాలు సంభవించాయి.

1. బారాకు, దెబోరా అక్కడ కనానీయులను ఓడించారు (న్యాయా 5:19-21).

2. యెహూ యూదారాజైన అహజ్యాను అక్కడ హతమార్చాడు. (2 రాజులు 23:29).

3. ఐగుప్తురాజైన ఫరోనెకో తన్ను ఎదుర్కొన వచ్చిన రాజైన యోషీయాను మెగిద్దో దగ్గర కనుగొని అతని చంపెను (2 రాజులు 23:29).

4. మెగిద్దోను మైదానములో గిద్యోను మిద్యానీయులను ఓడించెను (న్యాయా 6:33; 7:20)

5. రాజైన సౌలును, అతని కుమారుడును యుద్ధ భూమిలో ఇక్కడే చంపబడ్డారు (1 సమూ 31:1-6).

6. మెగిద్దోనును ప్రలాపముతో జెకర్యా గుర్తించాడు (జెకర్యా 12:11).

పన్నెండవ శతాబ్ధములో ముస్లిములు, కేధలిక్కులు అక్కడ యుద్ధాలు చేసారు. తుర్కు దేశస్థులను నెపోలియన్ 1799లో అక్కడే యుద్ధంలో ఎదుర్కొన్నాడు. 1918లో బ్రిటీషువారు కూడ అక్కడ తుర్కులతో యుద్ధం చేసారు.

ఈరీతిగా మెగిద్దో లేక హార్ మెగిద్దోను నరవధకు, రక్తపాతానికి, దుఃఖానికి గురుతైయింది.

1. ప్రకటన గ్రంధంలో ఈ భూగోళ ప్రాంతాన్ని బట్టి ఒక ఆత్మీయ సూత్రం తెలియ జెప్పడానికి మెగిద్దోను హార్ మెగిద్దోను వాడబడింది.

ప్రకటన గ్రంధములో బబులోను

రోమాసామ్రాజ్యానికి గురుతుగా వాడబడింది. ఐగుప్తు సొదొమలు దుర్మార్గతను, బలత్కారమును సూచించుటకు వాడబడినవి.

**హార్ మెగిద్దోను సత్యం :**

ప్రకటన 16:14 దేవుని మహాదినమును గూర్చి చెప్పుచున్నది.

ప్రకటన 16:15 "ఇదిగో నేను దొంగవలె వచ్చుచున్నాను" అని చెప్పుచున్నది. ఈ రెండూ క్రీస్తు రెండవ రాకడను గూర్చి చెప్పుటలేదా? (2 పేతురు 3:12; 1థెస్స 5:2).

ప్రకటన 16:16 హార్ మెగిద్దోను యుద్ధాన్ని గూర్చి యేమీ చెప్పుట లేదు. గాని "హార్ మెగిద్దోను చోటకు వారిని పోగుచేసెను''. అని మాత్రమే చెప్పబడింది అక్కడ యుద్ధం అంటూ యేమీ జరుగలేదు.

నిజమైన యుద్ధం ప్రకటన 19:11-16లో కనబడ్తాది. క్రీస్తు వారు ఆయనకు అవిధేయులైన వారందరినీ తీర్పులో నాశనం చేస్తారు .

హార్ మెగిద్దోను మంచి చెడుగుల మధ్య సంభవించే ఘర్షణయే. మంచి చెడుగల మధ్య జరిగే ఆఖరి యుద్ధం ఎక్కడ జరుగును? నిజానికి అదెక్కడ జరుగుచున్నది? అది మానవ హృదయాల్లోనే కాదా? మానవుని ఆత్మను రక్షించడానికి పరిశుద్ధాత్ముడు. నాశనం చేయడానికి సాతానుడు అనుక్షణం పోరాడుట లేదా?

**ముగింపు :**

మనది ఆత్మీయ యుద్ధం. అది రక్తమాంసాలతో పోరాడేది కాదు. శరీలతో కాదు గాని అంధకార సంబంధమైన లోక నాధులతోను. ఆకాశమందున్న దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము (ఎఫెసీ 6:12).

సాతాను శోధనలు జయించి బలముగా సువార్తను చాటుటకు పోరాడుచున్నాము. మానవులను దేవుని రాజ్యములోనికి నడిపించి వారి ఆత్మలను రక్షించుటకు పోరాడుచున్నాము.

అక్కడే యుద్ధము జరుగుచున్నది.

అందువలన మనం అన్ని వేళల మెలకువగా యుండాలి, ఆయన సేవలో చురుకుగా యుండాలి.

అట్లుంటే ఆయన రాకడలో సిద్ధపడి యుంటాము. సిగ్గు పడము !!.

బైబిలు సర్వే - 9

# విభజించబడిన రాజ్యము

సొలొమోను మరణము ద్వారా ఐక్యరాజ్యముగా ఉన్న ఇశ్రాయేలీయుల గొప్ప చరిత్ర అంతమైనది. ఆ తర్వాత రాజ్యము రెండు భాగములుగా విభజింపబడి 388 సం॥లు కాలమున్నది. సొలొమోను మరణానంతరము ఆయన కుమారుడైన రెహబాము సింహాసము నధిష్ఠించెను. తన తండ్రియైన సొలొమోను పరిపాలించిన కాలములో పన్నుల భారము భరించలేక ప్రజలు విసిగిపోయిరి. యరోబాము నాయకత్వములో తమ భారమును తగ్గించుమని ప్రజలు రెహబామును కోరిరి. ఈ యరోబాము సొలొమోను ఆస్థానములో సైన్యాధిపతిగా ఉండెను. రెహబాము చాలా అవివేకమైన సమాధానము ఈ విధముగా వారికి చెప్పెను.

"నా తండ్రి మీ కాడిని బరువుగా చేసెనుకాని నేను మీ కాడిని మరి బరువుగా చేతును" (1 రాజులు 13:14). అంత ప్రజలు కోపోద్రేకులై రాజునకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేసి 10 గోత్రికులు యరోబామును తమకు రాజుగా అభిషేకించిరి. యారోబాము పరిపాలించు ఈ పది గోత్రాలకు ఉత్తర రాజ్యము, లేక ఇశ్రాయేలు అని పిలువబడు చుండెడిది. దక్షిణముననున్న రెండు గోత్రికులు యూదా, బెన్యా మీను అను వారు రెహబాముతో ఉండిరి. దీనికి దక్షిణ రాజ్యమనియు యూదా అనియు పిలువబడుచుండెడిది. (బెన్యామీను గోత్రము చాలా చిన్నది. కనుక యూదా వారి ఆధిపత్యము ఎక్కువగా ఉండెడిది. 2 రాజుల గ్రంధము రాజుల మొదటి గ్రంధమునందలి ఆఖరి భాగము మరియు దినవృత్తాంతములు రెండవ గ్రంధమునందు ఈ విభజించబడిన రాజ్యము యొక్క చరిత్ర స్పష్టముగా వ్రాయబడియున్నది.

## ఉత్తరముననున్న ఇశ్రాయేలు రాజ్యము

ఉత్తరరాజ్య చరిత్ర అంత సుఖప్రదమైనదిన కాదు. దాని 253 సం॥ల కాలమున ఒకరి తర్వాత ఒకరు చాలా చెడ్డ రాజులు పరిపాలించిరి దీనిని

పరిపాలించిన 19 మంది రాజులలో ఒక్కడు కూడా సన్మార్గులు. లేరు. ఈ కాలమునందు 9 కుటుంబములు ఈ రాజ్యమును పరిపాలించిరి. వీరిలో చాల మంది హత్యచేయబడి, వారియొక్క స్థానము ద్రోహులచే అపహరించబడినది. యరోబాము ప్రజలు యెరూషలేమునకు వెళ్ళి దేవుని ఆరాధించినప్పుడు రెహబామును రాజుగా కోరుదురే మోనని భయపడి బంగారు దూడలను చేయించి బేతేలునందు, దానునందు అవే దేవుళ్ళుగా పూజించమని చెప్పెను. ఆయన చేసినవని వలన దేవునికి కోపమువచ్చి అహీయా అను ప్రవక్తను పంపించి యరోబాము యొక్క కుటుంబము ఇశ్రాయేలు రాజ్యము యొక్క నాశనమును గూర్చి ప్రకటించెను. ప్రవక్త యెహోవా దేవుడు ఇశ్రాయేలీయులను మొత్తునని ప్రకటించెను. మరియు దేవుడు ఇశ్రాయేలీయులను దేశము నుండి పారద్రోలి యొర్దానుకు అద్దరికి వారిని పంపించి వేయునని ప్రకటించెను. 1 రాజులు 14:15.

యరోబాము మరణానంతరము విగ్రహారాధన చాలా అధిక మాయెను. 7వ రాజైన ఆహాబు బయలు దేవత ఆరాధనను ప్రవేశ పెట్టెను. ఉత్తర దేశము తన మొట్టమొదటి 80 సం॥లు యూదా దేశముతో పోరాడుచునే యుండెను. ఆహాబు సింహాసనము నధిష్టించిన తర్వాత ఇశ్రాయేలు రాజ్యము అధః పాతాళమునకు తొక్కబడెను. ఈ ఆహాబు తూరురాజు కుమార్తెయైన యెజెబెలును వివాహము చేసికొనెను. ఆమె తనతో విగ్రహములను తీసికొని వచ్చి యెహోవా ఆరాధన ఇశ్రాయేలీయులలో లేకుండా తుడిచివేసెను. ఈ యెజెబెలు బైబిలునందు అతి దుష్టురాలైన స్త్రీ యని వర్ణించెబడెను. ఇంతటి దుర్మార్గులు వేరొకరు లేరు. ఆహాబు భార్యాలోలుడై ఆమెకు ఎదురు చెప్పక యుండెను. దేవుడు ఏలియా అను ప్రవక్తను ఆదేశమునకు పంపించి ఆ రాణి చేయుచున్న దుష్కార్యములను ఖండించెను. ఏలియా ప్రవక్త కర్మేలు పర్వతము మీద బయలు ప్రవక్తలతో పోటీ ఏర్పాటు చేసి వారు తప్పుడువారని నిరూపింపబడిన తర్వాత చంపివేసెను. ఈ కార్యమువలన దుర్మార్గురాలైన యెజెబెలు ఏలియాను చంపించవలయునని కోరిక ఎక్కువైనా ఎప్పుడూ ఆ కోరిక నెరవేరలేదు.

ఇశ్రాయేలు రాజులలో అందరికన్న మంచివాడు "యెహూ". ఇతడు ఆహాబు

కుమారుని తర్వాత రాజయ్యేను. ఇతడు ఏమాత్రం దయ చూపించ కుండా యేజెబెలును చంపి బయలు దేవత ఆరాధనను మట్టుపెట్టెను. కానీ అతని వట్టుదల నడలిపోయిన తర్వాత యరోబాముచే ప్రతిష్ఠింపబడిన బంగారు దూడలను మాత్రము తీసివేయలేదు. యెహూ తర్వాత రాజులైనవారు యరోబాము చేసిన పాపమును విడువలేదు. సొలోమోను తర్వాత ఇశ్రాయేలీయులు రాజ్యము 2వ యరోబాము కాలములో రాజకీయముగా అత్యున్నత స్థానమును అందుకొనెను. అదే సమయములో విగ్రహారాధాన కూడాపెచ్చు పెరిగెను. దేవుడు అహీయా ద్వారా చేసిన వాగ్దానము అనగా ఇశ్రాయేలీయులను నాశనము చేసి వారిని ఆదేశములో లేకుండా చేయుటను నెరవేర్చెను. క్రీస్తుపూర్వము 722లో అష్షూరు రాజు అధికమైన శక్తితో వచ్చి ఇశ్రాయేలీయులను అష్షూరునకు చెరగొని పోయెను. వారు అచ్చట నుండి మరి ఎన్నడును తిరిగి రాలేదు. దీని తర్వాత చరిత్ర దక్షిణమున గల యూదా రాజ్యమును గూర్చి :

దక్షిణ రాజ్యమైన యూదా

యూదా ఇశ్రాయేలు కంటే చిన్న రాజ్యము. బలహీనమైన రాజ్యము. కానీ అది ఉన్న 388 సం॥ల చరిత్రలో దేవునికి చాలా దగ్గరగా ఉండెను. చాలామంది రాజులు చాలా మంచివారు. మొత్తము మీద ఇశ్రాయేలు రాజుల కన్న దుర్మార్గులెవరును వీరిలో లేరు. అందరూ దావీదు సంతతివారే. రెహాబాము పరిపాలనలో యూదా క్షీణించుట మొదలు పెట్టెను. కానీ మంచి రాజులు అయిన 'అసా' యెహోషాపాతుల పరిపాలనలో గొప్ప పునరుద్ధరణ జరిగినది. ఆ తర్వాత కాలములో యూదా ఇశ్రాయేలు నుండి బయలు దేవత ఆరాధనను అనుసరించుట మొదలు పెట్టెను. రాజైన హిజ్కియా విగ్రహారాధన పూర్తిగా తీసివేసెను. ఆయన మునిమనుమడైన యోషియా యూదాను పరిపాలించిన రాజులలో అత్యుత్తముడు. కాని హిజ్కియా కుమారుడైన మనష్షే తండ్రి ఎంత మంచివాడో అంతచెడ్డవాడు. అతని 55సం॥ల పరిపాలనలో ప్రతి విధమైన విగ్రహారాధనను దేశములో ప్రవేశపెట్టి తుదకు తన బిడ్డలను కూడా అగ్నికి ఆహుతి చేసెను. ఇది బహు హేయమైనదిగా దేవుని దృష్టికి కనిపించి యూదాను కఠినముగా శిక్షస్తానని ప్రవక్తల ద్వారా తెలియపరచాడు. యోషియా రాజెన తరువాత ప్రజలను

మరలా యెహోవా వైపునకు త్రిప్పెను. అంతవరకూ లభ్యముకాని దేవుని ధర్మశాస్త్రము దేవాలయములో దొరికినప్పుడు ప్రజలెన్నడూ చూడనంతటి మతోద్ధరణను కావించెను.

యోషియా చనిపోయిన తర్వాత యూదా త్వరితగతిని క్షీణింప మొదలు పెట్టను. ఆయన తరువాత రాజులు చెడ్డవారు బలహీనులు. యూదా అతి స్వల్ప కాలములోనే బబులోను రాజ్యమునకు సామంత రాజ్యమైనది. యూదారాజు తిరుగుబాటు చేసినప్పుడు క్రీ॥పూ॥ 606లో బబులోను రాజైన నెబుకద్నెజరు దండెత్తి వచ్చి జయించి, చాలామంది ప్రజలను చెరకొని పోయెను. 1000 సం॥ల క్రితం ఇశ్రాయేలీయులను అష్షూరు వారు ఈ విధముగనే చేసిరి. తరువాత సిద్కియా మిగిలిన కొద్దిమందిని కొంత కాలము పరిపాలించెను. కానీ క్రీ॥పూ॥ 587 లో రాజును చాలా మంది ప్రజలను బబులోను చెరలోనికి తీసుకొని పోయిరి. దేవుడనుగ్రహించిన యీశిక్షవల్ల యూదులు గొప్ప పాఠమును నేర్చుకొనియిక ఎప్పుడూ విగ్రహారాధన వైపు తొంగియైనా చూడలేదు.

### బబులోను చెర

యూదులు చెరలో 70 సంవత్సరాలు వున్నారు. చెరలో వారి జీవిత చరిత్రను గూర్చి దానియేలు గ్రంధమునందు ఎస్తేరు గ్రంధమునందు చదువగలము. వీటియందు చాలా విపులమైన చరిత్ర కలదు. అగ్నిగుండములో ముగ్గురు యూదా యౌవ్వనస్తులు పారవేయబడుట మొదలగు చక్కని వృత్తాంతము లెన్నియెూ యిందు వ్రాయబడినవి. దానియేలు రాజు రాబోవు సంగతులను గూర్చి ప్రవచించెను. హస్తము గోడ మీద వ్రాయుటను గూడా మనము యిందు చదువగలము. ఎస్తేరు గ్రంధము నందు ఒక యూదా కన్యక ఏలాగు ఆదేశ రాణిమైనదో వ్రాయబడినది. ఆమె తన ప్రజలను రాజాజ్ఞ నుండి మరణము నుండి ఏలాగు తప్పించినదో గూడా వ్రాయబడినది.

### యూదులు తిరిగి వచ్చుట

క్రీ॥పూ॥ 536లో జెరుబ్బాబెలు నాయకత్వమున చాలా మంది యూదులు చెర నుండి యెరుషలేమునకు తిరిగి వచ్చిరి. ఆయన నాశనము చేయబడిన సొలోమోను దేవాలయమునకు బదులుగా క్రొత్త దేవాలయముకట్ట మొదలు పెట్టెను. తరువాత గొప్ప యాజకుడు మరియూ వ్రాతగాడైన ఎజ్రానాయకత్వమున

కొంతమంది చెర నుండి తిరిగి వచ్చిరి. వీరు యెరుషలేము గోడలను తిరిగి కట్టారు. చెరలోవున్న యూదులందరూ తిరిగి రాలేదు. యూదా రాజ్యము తిరిగి స్థాపించడలేదు.

నెహేమ్యా గ్రంధమున యూదుల రాజకీయ చరిత్ర అంతమగుట చూడగలం. తరువాత క్రీస్తు వచ్చు వరకూ గల 400సం॥ల చరిత్రను పాతనిబంధన ద్వారా కాకుండా అప్రమాణ గ్రంధముల ద్వారా కొంత గ్రహించగలుగుచున్నాము. ఈ కాలమందు వారు పారశీకుల ద్వారా కొంత కాలము, మాసిదోనియా వారిద్వారా కొంతకాలము, రోమీయుల ద్వారా కొంతకాలము పరిపాలించబడిరి. కొద్ది కాలముమట్టుకు మక్కబీయుల ద్వారా స్వతంత్ర పరిపాలన గావించిరి.

**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీ యింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80, KAKINADA - 533 001.

గమనిక : సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపిచవలయును.

# బిడ్డలను పెంచుట ఎట్లు
## ( How to Bring up Children)

అన్నింటికంటే బిడ్డలను పెంచుట బహుశ కష్టమైన పని. మన పిల్లలందరు మంచిగా తయారవ్వాలని మనందరం కోరుకుంటాము. అయితే అందుకు జవాబును నేనెరగుదునని చెప్పజాలము. నిజానికి నాకు వయస్సు వచ్చే కొలదీ నాకు తెలియనిది చాలవున్నదని నేనెరుగుదును. మన బిడ్డలను సరిగ పెంచువిధానములో కొన్ని సలహాలను దిగువ ఇవ్వాలని కాంక్షించుచున్నాను.

**1. మీ గృహాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దండి :**

పిల్లలు ఆనందదాయకమైన వాతావరణంలో పెరిగితే, వారు మంచి వ్యక్తులుగా తయారయ్యే అవకాశం మెండుగా యున్నది.

**2. మీ పిల్లలతో సమయం గడపండి :**

చాల మంది తల్లిదండ్రులు వృత్తిరీత్యా తమ పిల్లలతో సమయం గడుపుట లేదు. గాని పిల్లలకు తలిదండ్రులు ప్రేమ, ఆప్యాయత అత్యవసరం. మన పిల్లలు త్వరలో పెరిగి పెద్ద వారవుతారు. జీవితంలో స్థిరపడతారు. ఈలోగా వారితోమీరు, మీతోవారు సమయాన్ని పంచుకోవాలి.

**3. పిల్లలకు గృహసంబంధమైన బాధ్యతలు క్రమేపి అప్పగించాలి :**

యిది వారికి తమ బాధ్యతలను కృషి యొక్క ప్రాముఖ్యతను నేర్పును.

**4. దబ్బుకంటే మంచి పేరు ముఖ్యమని మీ పిల్లలకు నేర్పాలి :**

"గొప్ప ఐశ్వర్యము కంటే మంచి పేరును వెండి బంగారముల కంటె దయయు కోరదగినవి" (సామెతలు 22:1). మనుష్యులందరి దృష్టికి మేలైనవాటిని గూర్చి ఆలోచించాలని పిల్లలకు నేర్పాలి (రోమా 12:17).

**5. మంచి మాదిరి యొక్క ప్రాముఖ్యత గ్రహించాలి :**

మన మాదిరి యొక్క ప్రభావము మన పిల్లలపై చాల వుంటాది. క్రీస్తువలె మీ బిడ్డలు ఉండాలంటే మీరు వారియెదుట క్రీస్తువలె జీవించాలి.

మంచి తలిదండ్రులుగా మన పని కష్టమేగాని 'అసాధ్యం కాదు'. దేవుని సహాయం వలన మన బిడ్డలను మంచిగా పెంచగలం. "కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలముఆయన యిచ్చు బహుమానమే" యని మనం ఎన్నడు మరువరాదు. (కీర్తన 127: 3-5).

**- కెన్ టైలర్**

# సంక్షిప్త వార్తలు

2008 మార్చి నెల 10వ తేదీ సోమవారం పెద్దాపురం మండలం గోరింట గ్రామములో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు రిక్కీ గూటం గారు రిబ్బను కత్తిరించి దేవుని మహిమార్థమై ప్రతిష్ఠించిరి. ఆ సందర్భములో అమెరికా నుండి విచ్చేసిన జెర్రీబేట్స్ గారు వారి సతీమణి పాలా బేట్స్ గారు కూడ ఆ కార్యక్రమములో పాల్గొనిరి. జెర్రీ బేట్స్ గారు క్రీస్తు సంఘ ప్రాముఖ్యతను గూర్చి లేఖనముల నుండి చక్కటి వాక్యోపదేశము గావించిరి. నూతనముగా నిర్మించబడిన ఆలయము దాని ప్రాంగణము ఆరోజు వందలాది మందితో గొప్ప సందడిగా యుండెను. ఆలయ నిర్మాణములో సహకరించిన సంఘస్థులు, గ్రామస్థులు కూడా ఆనంద వదనములతో ఆ రోజు దేవుని స్తుతించిరి, దేవునికి కృతజ్ఞతలు తెలియజేసిరి. గోరింటలో సోదరులు యమ్. ప్రేమ్ కుమార్ గారు అనేక సంవత్సరములుగా నిర్విరామ కృషి చేస్తూ సంఘమును ఆత్మీయముగా ముందుకు నడిపించుచున్నారు. ఆ రోజు హాజరైన వారందరికీ స్థానిక సంఘమునకు మంచి విందు చేసిరి.

2008 ఏప్రియల్ 25వ తేదీ శుక్రవారం పశ్చి గోదావరి జిల్లా బీమడోలు మండలం కురెళ్ళగూడెంలో క్రీస్తు సంఘ సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఆ సదస్సుకు ఉభయ గోదావరి జిల్లాలు మరియు కృష్ణా జిల్లా నుండి కూడా అనేకమంది సువార్తికులు హజరై చక్కటి సహవాసములో పాల్గొనిరి. “నేడు పరిశుద్ధాత్ముడు ఎట్లు పనిచేయుచున్నాడు? అను అంశము ఆ రోజు చర్చించబడెను. సోదరులు రిక్కీ గూటం గారు అధ్యక్షత వహించి కార్యక్రమమును చక్కగా నిర్వహించిరి. సోదరులు జి. షద్రక్ (పాలకొల్లు) యన్. మోజెస్ (కరుగోరుమిల్లి) డి రంగారావ్ (గొల్లవిల్లి) తదితర సోదరులు దైవగ్రంధము నుండి పై అంశమును చర్చించిరి.

దేవుడు గతంలో నానా సమయములలో, నానా విధములుగా ప్రవక్తల ద్వారా మాటలాడెను. యేసుక్రీస్తును ఆయన ఈ లోకమునకు పంపెను. ఆయన మృతి జెంది సమాధి చేయబడి పునరుత్థానుడై పరమున కారోహణమై పరిశుద్ధాత్మను పంపెను. ఆయన అపొస్తలులను, క్రొత్త నిబంధన లేఖకులను

సర్వ సత్యములోనికి నడిపించెను. వారిచే దేవుని అంతిమ బయల్పాటును గ్రంథస్థము చేయించెను. పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందిన వానికి పరిశుద్ధాత్మ అనువరము వాగ్దానము చేయబడెను. దేవుని వాక్యమును విని, విశ్వసించి, విధేయత చూపించి, నమ్మకముగా యున్న వాని జీవితంలో వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు నేడు పనిచేయుచున్నాడు అని సోదరులు తెలియజేసిరి. రిక్కీ గూటం గారు గంభీర ప్రసంగమును చేసిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము చక్కటి విందు నేర్పాటుచేసిరి. కురెళ్లగూడెంలో సోదరులు బుర్రేయోహాను గారు నిర్విరామ కృషి చేస్తూ పరిసర ప్రాంతములలో సువార్త చాటుచున్నారు.

2008 మే నెల మొదటి తేదీ గురువారం నాడు రామచంద్రపురం అగ్రహారంలో జరిగిన సువార్త కూటములో రిక్కీ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. ఎండ యొక్క తీవ్రత హెచ్చుగా యున్నను అనేకులు ఆ కూటమునకు హాజరై దేవుని వాక్యమును శ్రద్ధగా వినిరి. వారిలో ముగ్గురు ఆ రోజు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అగ్రహారంలోను, ఓదూరులోను సోదరులు పులగల సుందర్రావు గారు సతీసమేతముగా క్రీస్తు కొరకు కష్టించి పనిచేయుచున్నారు.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004